సాక్షి
జనగామ

శుక్రవారం | 19 | జూలై | 2024



అనారోగ్య ఆహారం..

ఫాస్ట్ ఫుడ్.. ప్రస్తుత సమాజంలో ఫ్యాషన్‌గా మారింది. పేద, మధ్యతరగతి, ధనికులు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ ఆ ఆహారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. - 8లో



టీజీడీఎస్సీ షురూ..

టీజీడీఎస్సీ గురువారం నుంచి ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) టెస్ట్ నిర్వహిస్తున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
27^0 / 24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి తేమతో కూడిన చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురుస్తుంది. మధ్యాహ్నం సమయంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

హిందూ దేవాలయాల్లో హలాల్ వద్దు



జనగామ: దేవాలయాల ప్రాంగణంలో కోళ్ల, మేకల హలాల్ వద్దని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు జనగామ మండలం యశ్వంతాపూర్ రేణుక ఎల్లమ్మ, ఉప్పలమ్మ, పోచమ్మ ఆలయాల వద్ద ఫ్లెక్సీతో భక్తులకు అవగాహన కల్పించారు. అనంతరం సమితి నాయకులు మంతెన మణికుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. దేవాలయాల వద్ద కోళ్ల, మేకలను హలాల్ చేయడం మహా పాపమని, వాటికి జట్కా ఇచ్చి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ ప్రతినిధి అర్జున్‌సింగ్, హిందూ వాహిని ప్రతినిధి వెంపటి అజయ్, చిక్కుడు నగేష్, పవన్, అనిల్, లఖన్‌సింగ్, కొలిపాక లక్ష్మణ్, రాకేష్ పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సిద్ధారెడ్డి అన్నారు. శివునిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, సెల్‌ఫోన్ వ్యసనాలతో కలిగే అనర్థాలపై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని, వాటి వినియోగంతో ఆరోగ్యాలు క్షీణించడంతో పాటు ప్రాణహాని కలుగుతుందని చెప్పారు. యోగా, ప్రాణాయామం, ఆటలతో మానసిక ఉల్లాసం పొందాలని సూచించారు. అవసరానికి మించి సెల్‌ఫోన్ వినియోగించొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు కమలాకర్, లావణ్య, అధ్యాపకులు లలిత, సాంబమూర్తి, ధనుంజయ్, సౌభాగ్యలక్ష్మి, థామస్ పాల్గొన్నారు.

రూ.3లక్షల విలువైన గుట్కాల పట్టివేత



జనగామ: పట్టణంలో నిషేధిత గుట్కా అమ్మకాలపై గురువారం రాత్రి టాస్క్‌ఫోర్స్, పోలీసుల ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై సృజన్ నేతృత్వంలో సాయినగర్ కాలనీకి చెందిన లెంకలపల్లి సాయిచంద్ర వద్ద అక్రమంగా నిలువ చేసిన రూ.3.08 లక్షల విలువ చేసే వివిధ కంపెనీల గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కేయూ హాస్టళ్లు ఖాళీ చేయాలని సర్క్యులర్ జారీ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ కోర్సుల ఫైనలియర్ విద్యార్థులకు గురువారంతో పరీక్షలు ముగిశాయి. అన్ని పీజీ కోర్సుల ఫైనలియర్ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు ముగిసినందున యూనివర్సిటీ క్యాంపస్‌లోని హాస్టళ్లలో వసతి పొందుతున్న ఆయా ఫైనల్ ఇయర్ విద్యార్థులు తమ గదులను ఖాళీ చేయాలని గురువారం కేయూ హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. వివిధ హాస్టళ్ల వద్ద, మెస్‌ల వద్ద కూడా ఆ సర్క్యులర్‌ను నోటీస్ బోర్డులో అతికించారు. ఈనెల 28 వరకు తమ గదులను ఆయా విద్యార్థులు ఖాళీ చేయాలన్నారు. ఖాళీ చేసిన గదుల తాళాలను సంబంధిత హాస్టల్స్ కేర్‌టేకర్లకు అప్పగించాలని చెప్పారు. సర్క్యులర్‌లో పేర్కొన్నట్లుగా వెకేట్ చేయకపోతే ఆయా విద్యార్థుల గదులకు తాళాలు వేయిస్తామని స్పష్టం చేశారు. ఆతర్వాతి పరిణామాలకు సిబ్బంది బాధ్యత వహించరని తెలిపారు. అలాగే మెస్ కార్డులను క్యాన్సిల్ చేసుకోవాలని రాజ్‌కుమార్ కోరారు.

రఘునాథపల్లిలో సీఎం, రాహుల్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, గానుగుపహాడ్‌లో సీఎం వీసీని వీక్షిస్తున్న ఎంపీ, కొమ్మూరి, కలెక్టర్ తదితరులు





పండుగలా ‘రుణమాఫీ’

మొదటి విడత రూ.233 కోట్లు
- రైతు వేదికల్లో ఘనంగా వేడుకలు
- పాలాభిషేకాలు.. టపాసుల మోతలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశం
- హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్


Your SB A/c *0093 Credited for Rs.45985.00 on 18-07-2024 19:14:43 by NEFT/ PAY AND ACCOUNTS OFF UTR: RBI2012404416474 Avl Bal Rs.45687.27 -Union Bank of India

Farmer name: Gugulothu Bindu
Village : Rajavaram
Mandal: Chilpur,
Dist : Jangaon

Sir this amount of crop loan waived

ఓ రైతుకు వచ్చిన ఫోన్ మెసేజ్

జిల్లాలో మొదటి రోజు రుణమాఫీ వివరాలు నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	రుణఖాతాలు	కుటుంబాలు	మాఫీ రుణం
స్టేషన్‌ఘన్‌పూర్	14,689	14,168	రూ.83.63కోట్లు
జనగామ	11,954	11,522	రూ.69.04కోట్లు
పాలకుర్తి	14,629	13,945	రూ.80.66కోట్లు

జనగామ: జిల్లాలో రైతు రుణమాఫీ పండుగలా సాగింది. 12 మండలాల పరిధి రైతు వేదికల్లో గురువారం మొదటి విడత రుణమాఫీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కలెక్టర్ రిజ్వాన్‌బాషా సమక్షంలో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, డీఏఓ వినోద్‌కుమార్, సహకార అధికారి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రుణమాఫీ వేడుకలకు సంబంధించి వీసీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. జనగామ మండలం గానుగుపహాడ్ రైతు వేదికలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, రఘునాథపల్లిలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీఓ కొమురయ్య, డీఏఓ వినోద్‌కుమార్, పాలకుర్తిలో ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్ నుంచి వర్చువల్ పద్ధతిలో రుణమాఫీని ప్రారంభించగా.. ఆయా ప్రాంతాల్లో ముఖ్యఅతిథులుగా హాజరైన వారు రైతులతో కలిసి వీక్షించారు. మిగతా చోట్ల ఆర్డీఓ, ఆయా శాఖల ఉన్నతాధికారులు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పాలాభిషేకాలు.. టపాసుల మోతలు

రుణమాఫీ ప్రారంభం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, రైతులు సీఎం ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేసి సంబరాలు జరుపుకున్నారు. అంతకు ముందు రైతు వేదికల ద్వారా సీఎం సందేశాన్ని వినిపించారు. వేడుకల్లో 5వేల మందికి పైగా రైతులు పాల్గొన్నారు. మొదటి రోజు రూ.233.33 కోట్లు జమయ్యాయి. సాయంత్రం 4 గంటలకు రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ అయినట్లు రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వచ్చాయి.

మరిన్ని చిత్రాలు 9లో..

దేశ చరిత్రలోనే మొదటిసారి..

- వరంగల్ ఎంపీ కడియం కావ్య

రఘునాథపల్లి: వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు అప్పుల ఊబిలో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ఏక కాలంలో రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే మొదటిసారి.. రైతుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రైతు రుణమాఫీ ప్రారంభం సందర్భంగా మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. అంబేడ్కర్, ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 39,635 మంది రైతు కుటుంబాలకు రూ.233.38 కోట్ల నిధులు ఖాతాల్లో జమయ్యాయన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 14,168 కుటుంబాలకు రూ.83.63 కోట్లు విడుదలైనట్లు పేర్కొన్నారు. రఘునాథపల్లి మండల రైతులు ఎక్కువగా లబ్ధిపొందారని, అందుకే ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

జనగామ రూరల్: ఇచ్చిన మాటకు కట్టుబడి రైతుల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. గానుగుపహాడ్ రైతు వేదికలో కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన రుణమాఫీ విడుదల కార్యాక్రమానికి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ వీక్షించిన అనంతరం ఎంపీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తున్న సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో చెప్పింది ఒక్కటీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలు అమలు చేస్తున్నదని చెప్పారు. కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయం చేయాలి.. ఆ తర్వాత అంతాకలిసి ప్రజా సంక్షేమానికి ఉపయోగపడేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏసీపీ పార్థసారథి, డీఆర్‌డీఓ మొగిలప్ప తదితరులు పాల్గొన్నారు.





కొనసాగుతున్న శాకంబరీ ఉత్సవాలు

భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రోత్సవాలు గురువారం పదమూడో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని బలకా, విజయా క్రమంలో పూజించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిథి మండల దేవతాయజనంలో భాగంగా అమ్మవారి స్నపనమూర్తిని కాళీక్రమమైన బలకా అమ్మవారిగా, భోగబేరాన్ని షోడశీ క్రమంలో విజయా అమ్మవారిగా అలంకరించి పూజలు చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- హన్మకొండ కల్చరల్

హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధం కావాలి

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: పార్లమెంట్ ఎన్నికల సమయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన ఛాలెంజ్‌కు కట్టుబడి స్పీకర్ ఫార్మెట్‌లో రాజీనామాకు సిద్ధం కావాలని డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో రూ.లక్ష రుణమాఫీ చేసిన నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో కొమ్మూరి ఆధ్వర్యాన సంబురాలు జరుపుకున్నారు. అంతకు ముందు డీసీసీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి.. సోనియా, రాహుల్, సీఎం రేవంత్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోగా వందశాతం రుణమాఫీ జరగబోతున్నదని, హరీశ్‌రావు తన పదవికి రాజీనామా చేయడంతో పాటు శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పొందిన రైతులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీకి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సర్వల నర్సింగరావు, డాక్టర్ రాజమౌళి, కుమారస్వామి గౌడ్, లింగాల నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, జనగామ వీరేందర్ రెడ్డి, చెంచారపు బుచ్చిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణిమల్లారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



వేడుకలకు బైక్‌పై వస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దు

- జరిమానాలు పెరిగాయి.. జాగ్రత్త
- డీసీపీ రాజమహేంద్రనాయక్
- డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన

జనగామ: మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దు.. పెనాల్టీలు పెరిగాయి.. జాగ్రత్తగా ఉండాలని డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. జనగామ పోలీస్‌స్టేషన్‌లో గురువారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం ఏసీపీ పార్థసారథి, సీఐ రఘుపతిరెడ్డితో కలిసి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని, మద్యం మత్తులో జరిగే రోడ్డు ప్రమాదాలతో అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయన్నారు. వాహనం రోడ్డుపైకి వచ్చిందంటే ఆర్టీఏ నిబంధనలతో పాటు ట్రాఫిక్ నియమావళిని పాటించాలని చెప్పారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ లేకుండా బయటకు రావద్దని, దీనిపై ప్రజల్లో అవగాహన కలిగించిన తర్వాత జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే రూ.10వేల వరకు జరిమానా విధిస్తారని, మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, రాత్రి 10 గంటలు దాటిన తర్వాత బయటకు వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. సదస్సులో ఎస్సైలు సృజన్, తిరుపతి, శ్వేత, కేశవులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

పదవులకే విరమణ.. ప్రజాసేవకు కాదు

చిల్పూరు: ప్రజాప్రతినిధుల పదవులకే విరమణ.. ప్రజాసేవకు కాదు.. ఎప్పటిలాగే ప్రజలతో మమేకమై ఉండాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మాజీ ఎంపీపీ సరితబాలరాజు, ఎంపీటీసీల పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డబ్బులతో పదవులు రావు.. ప్రజల వెంట ఉంటూ పార్టీ కోసం కష్టపడిన వారికి మంచి అవకాశం ఉంటుందన్నారు. పదవి ముగిసింది.. ఇక ఎవరితో పనిలేదనుకునే వారికి తిరిగి రాజకీయంగా ఎలాంటి అవకాశాలు దక్కవని చెప్పారు. అనంతరం మాజీ ఎంపీపీ సరితబాలరాజు, వైస్ ఎంపీపీ భూక్య సరితనర్సింహ, ఎంపీటీలు ఉమసమ్మయ్య, లలితశ్యాంకుమార్‌రెడ్డి, కంకటి రవీందర్, శిరీషసురేష్, ఝాన్సీ, ఎన్నకూస కుమార్, అయిలమ్మ ఎల్లయ్య, సుధాకర్, యాదగిరి, సాదం నర్సింహులును సన్మానించారు. పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి సింగపురం ఇందిర, చిల్పూరు ఆలయ అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, యాదవరెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, రంగు రమేష్, మాలోతు రాజు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీపీ, ఎంపీటీల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న కడియం శ్రీహరి

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

బచ్చన్నపేట : అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకురాలు కె.ఎల్లమ్మ కోరారు. ఈ మేరకు మహిళా అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీలను హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వాలంటరీ రిటైర్మెంట్ అవకాశం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అంగన్‌వాడీలకు అదనపు పనులు అప్పగించవద్దని, బీఎల్‌ఓ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. వారి వెంట రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నల్ల భారతి, రమాతార, కోశాధికారి వేదవతి, శిరీష, పుష్ప, నాగలక్ష్మి, చిన్నమ్మడు, అనిత తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఎల్లమ్మ, భారతి తదితరులు

పార్టీని బలోపేతం చేయాలి

- బీజేపీ రాష్ట్రీయ సంఘటన్ కార్యదర్శి చంద్రశేఖర్‌జీ

జనగామ రూరల్: వచ్చే ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలంటే క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని రాష్ట్రీయ సంఘటన్ కార్యదర్శి చంద్రశేఖర్‌జీ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించడంతోపాటు అర్హులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి, నాయకులు, సిరికొండ విద్యాసాగర్, రమేష్, శివరాజ్, అనిల్, హరిశ్చంద్ర గుప్త తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ జీ

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- అర్హులందరికీ రైతు రుణమాఫీ
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ: ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు రుణమాఫీ మొదటి విడత రూ.లక్ష వరకు, రెండో విడత రూ.1.5 లక్షల వరకు, మూడో విడత రూ.2 లక్షలు దశలవారీగా జరుగుతుంది.. ఈ పథకాన్ని అర్హులైన రైతులంతా పొందేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. రైతు రుణమాఫీ పథకం అమలుపై గురువారం కలెక్టర్‌లో వ్యవసాయశాఖ, బ్యాంక్ అధికారులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడతలో 39,635 మంది రైతులకు రూ.లక్ష రుణమాఫీ వర్తిస్తుందని, ఇందుకు రూ.233 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ఈ మహాయజ్ఞాన్ని విజయవంతగా నిర్వహించాలని, ఎటువంటి సమస్యలు లేకుండా సామరస్యంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రేషన్ కార్డు లేని వారికి కూడా రైతు రుణమాఫీ వర్తిస్తుందనీ.. గతంతో రైతులు ఇతర పథకాల ద్వారా పొందిన రుణాలకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా.. మహిళా శక్తి పథకం గురించి మాట్లాడుతూ.. ఈ పథకాన్ని ప్రాధాన్యతాంశంగా భావించాలన్నారు. మత్స్యశాఖ ద్వారా సుమారు 2వేల మంది లబ్ధిదారులను గుర్తించినట్లు చెప్పిన కలెక్టర్.. వారికి డీఆర్డీఓ ఏపీఎంలతో కలసి బ్యాంకర్లు మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాడి, కోళ్ల పరిశ్రమ, ఆహార పదార్థాల ఉత్పత్తులు, మండలానికి ఒక మీ-సేవా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే సోలార్ యూనిట్ల ఏర్పాటుపై లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్, వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్, ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి లత, సహకార శాఖ అధికారి రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓలు, తహసీల్దార్లు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నేడు(శుక్రవారం) ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు వండిపెడుతున్న ఆహారంతోపాటు వంట గది, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించాలని ఆదేశించారు.

అక్రమ అడ్మిషన్లపై సీఎంకు ఎక్స్‌లో ఫిర్యాదు



న్యూశాయంపేట: మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్ల అక్రమాలపై ‘సాక్షి’లో ప్రచురితమైన కథనాన్ని లింక్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొట్ల నరేశ్ ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ చేశాడు. అక్రమాలపై విచారణ చేపట్టాలని బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జయశంకర్ భూపాలపల్లి గురుకులంలో అడ్మిషన్ పొందడానికి ఏకంగా మతమార్పిడి చేసి అడ్మిషన్ పొందిన ఘటనలు వెలుగులోకి వచ్చాయని, వాటిపై విచారణ చేపట్టాలని నరేశ్ కోరారు.

భజనకు తరలిన భక్తులు

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన శ్రీ శివరామకృష్ణ భజన మండలి సభ్యులు తిరుమల తిరుపతిలో భజన చేయడానికి గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన జరగనున్న అఖండ హరినామ సంకీర్తన భజనలో పాల్గొంటామని తెలిపారు. తిరుమలకు తరలిన వారిలో చింతల బాలయ్య, మూశిని బాబు, రావబ్రహ్మం, కనకాచారి, వెంకటేశ్వర్లు, మహేష్, దామోదర్, భాస్కరాచారి విజయ్, సాయికుమార్, సత్యనారాయణ, శ్రీనివాస్, భానుచందర్, గోపాల్, కనుకయ్యతో పాటు పలువురు ఉన్నారు.

మరో పోరాటానికి సిద్ధం కావాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న

జనగామ రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలకు వర్గీకరణ చేస్తామని మోసం చేసింది.. మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని నమ్మబలికి నేడు పట్టించుకోవడం లేదని, అన్ని రంగాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై దండోరా దరువు వేయడానికి ఆగస్టు 9న ఢిల్లీలో నిర్వహించే ఉపకులాల మహాసభకు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా మేడ స్వామిని నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్, నీరటి ప్రభాకర్, రమేష్, సురేందర్, యాకయ్య, విష్ణు, రాజు పాల్గొన్నారు.



స్వామికి నియామక పత్రం అందజేస్తున్న పాపన్న

భూవివాదంలో తలదూర్చుతున్నారు..

- సీఐపై బాధితుడు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపణ

జనగామ రూరల్: ఎర్రగొల్లపహాడ్ గ్రామంలో ఉన్న తన భూమి వివాదంలో స్థానిక సీఐ రఘుపతిరెడ్డి తలదూర్చుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని పీఏసీఎస్ చైర్మన్ చిర్ర శ్రీనివాస్‌రెడ్డి గురువారం పలువురు బాధితులతో కలిసి భూమి వద్ద నిరసన తెలిపాడు. వివరాలు ఆయన మాటల్లోనే.. 2018 సంవత్సరం 154/ఓ సర్వే నంబర్‌లోని మూడెకరాల భూమిని మధుసూదన్ వద్ద శ్రీనివాస్‌రెడ్డి కొనుగోలు చేశాడు. గతంలో ఈ భూమి విషయమై వంగ రాజేశ్వర్‌తో ఉన్న గొడవ సమసిపోయింది. కాగా చిర్ర హన్మంతరెడ్డి కొత్త సర్వే నంబర్లన్నీ ఒకే దానిపై తీసుకొచ్చి భూమి తనదని చెప్పడంతో కోర్టుకు వెళ్లగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. ‘స్థానిక సీఐ రఘుపతిరెడ్డి తమను బెదిరింపులకు గురి చేస్తున్నాడు.. భూమి విషయంలో 9 మంది గ్రామస్తులపై కేసులు పెట్టించిన హన్మంతరెడ్డికే వత్తాసుపలుకుతున్నాడు..’ అని శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై సీఐ రఘుపతిని వివరణ కోరగా.. భూమిలో గెట్లు నాటి ఆక్రమిస్తున్నారని హన్మంతరెడ్డి భార్య ఫిర్యాదు ఇవ్వగా ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్పారు. ఎవరికీ వత్తాసు పలకడం లేదని, చట్టం ప్రకారం నడుచుకుంటున్నామని వివరించారు.



నిరసన తెలుపుతున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

భూ తగాదాలో నలుగురికి జైలు

తొర్రూరు రూరల్: భూతగాదా ఘటనలో మండలంలోని వెలికట్ట గ్రామ శివారు చెల్లకుంట తండాకు చెందిన నలుగురు వ్యక్తులకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత తీర్పు వెలువరించినట్లు ఎస్సై జగదీశ్ గురువారం తెలిపారు. ఏడేళ్ల క్రితం జరిగిన వ్యవసాయ భూమి గెట్టు పంచాయితీలో మాలోతు గంగమ్మ, సోమాని దంపతులపై అదే తండాకు చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా వాదోపవాదాలు విన్న జడ్జి మట్ట సరిత.. నిందితులు మాలోతు దేవులా, మాలోతు పులి, మాలోతు అనిల్, మాలోతు పార్వతికి ఏడాది జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పువెలువరించారు. కాగా, నిందితులకు శిక్ష పడేలా సాక్షులను కోర్టులో హాజరుపరిచిన కోర్టు కానిస్టేబుల్ జెల్ల సతీష్‌ను డీఎస్పీ సురేష్, సీఐ సంజీవ, ఎస్సై జగదీశ్ అభినందించారు.

ఇద్దరి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

దంతాలపల్లి: బైక్‌ను ఢీకొని ఇద్దరి మృతికి కారణమైన లారీ డ్రైవర్ కటకం వేణుగోపాల్‌రావుకు తొర్రూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సరిత.. రెండు సంవత్సరాల జైలు, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. 2015లో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కుక్కుడం గ్రామానికి చెందిన పులుగుజ్జ రామ్మూర్తి, కొండ భిక్షం తమ సొంత పనుల నిమిత్తం బైక్‌పై దంతాలపల్లికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని కుమ్మరికుంట్ల సమీపంలో పాలేరువాగు వద్ద సూర్యాపేట వైపు నుంచి కిరోసిన్ లోడ్‌తో వస్తున్న ట్యాంకర్ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనపై పులుగుజ్జ రామ్మూర్తి భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి ఉమ్మడి నర్సింహులపేట ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేశారు. వాదప్రతివాదనల అనంతరం నేరం రుజువు కావడంతో తొర్రూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సరిత.. లారీ డ్రైవర్ వేణుగోపాల్‌రావుకు రెండు సంవత్సరాల జైలు, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా, నిందితుడికి శిక్ష పడేలా చేసిన పీపీ గణేష్ ఆనంద్, కోర్టు కానిస్టేబుల్ రాజారాంను ఉన్నతాధికారులు అభినందించారు.

ఆ రైతులకు రుణమాఫీ కాలేదు..!

- చింతలపల్లి సొసైటీ పరిధిలో 644మంది రైతులు
- తీసుకున్న రుణం రూ.3కోట్లు
- 2017నుంచి రుణాలు రెన్యువల్ చేయకపోవడంతో అనర్హత

సంగెం: రాష్ట్రంలోని రైతులు రుణమాఫీ సంబురాలు జరుపుకుంటున్నారు. అయితే వరంగల్ జిల్లా సంగెం మండలం చింతలపల్లి సొసైటీ పరిధిలోని రైతులు మాత్రం రుణమాఫీ అమలుకాకపోవడంతో బాధపడుతున్నారు. చింతలపల్లి సొసైటీ పరిధిలో చింతలపల్లి, కృష్ణానగర్, కుంటపల్లి తదితర గ్రామాల రైతులు 644మంది ఉన్నారు. వీరంతా 2017లో సుమారు రూ.3కోట్లు రుణం పొంది ఉన్నారు. 2018లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో అప్పటి నుంచి తమ రుణాలు రెన్యువల్ చేయకుండా ఉన్నారు. ఎట్టకేలకు 2023లో కేవలం 180మంది రైతులకు రూ.83లక్షలు మాత్రమే రుణమాఫీ జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం 12–12–2018 నుంచి 9–12–2023 వరకు రుణాలు పొందిన లేదా రెన్యువల్ చేసుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని చెప్పింది. దీంతో చింతలపల్లి సొసైటీ పరిధిలోని రైతులకు ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ వర్తించకుండా పోయింది. ఈ అంశంపై తమ గోడును పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మాఫీ వర్తించేలా చేయాలని కోరనున్నట్లు సమాచారం.

అనారోగ్య ఆహారం..

ఫాస్ట్‌ఫుడ్‌తో ఆరోగ్య సమస్యలు

- హెచ్చరిస్తున్న వైద్యనిపుణులు
- రంగులు కలిపిన ఆహారం విక్రయం
- పుట్టగొడుగుల్లా షాపులు..
- నాణ్యతాప్రమాణాలు గాలికి..

కాజీపేట : ఫాస్ట్ ఫుడ్.. ప్రస్తుత సమాజంలో ఫ్యాషన్‌గా మారింది. పేద, మధ్య, ధనికులు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో తినుబండారాలు తయారు చేసుకోలేక ఫాస్ట్ ఫుడ్‌పై ఎక్కువ ఆధారపడుతున్నారు. పాశ్చాత్య ఆహారపు అలవాట్లను వంట బట్టించుకుంటున్నారు. అయితే వీటి వెనుక ఉన్న అనారోగ్య సమస్యలు గుర్తించలేకపోతున్నారు. రోగ నిరోధక శక్తి తగ్గడానికి, అధిక బరువు పెరగడానికి పెద్ద వయసువారిలో పొట్ట పెరగడానికి ఫాస్ట్‌ఫుడ్ ఇన్‌స్టెంట్ ఫుడ్ కారణమని వైద్యులు పేర్కొంటున్నారు.

నాణ్యతాప్రమాణాలు గాలికి

ఆకలి రుచి ఎరగదు..నిద్ర సుఖ మెరుగదంటారు. ఈ సామెతను అందిపుచ్చుకున్న కొందరు వ్యాపారులు జిల్లాలో అనేక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో నూడుల్స్, పానీపూరి, బేకరీ ఐటమ్స్, నాన్‌వెజ్ ఫ్రైడ్ రైస్ వంటి ఆహారపదార్థాలు విక్రస్తున్నారు. అయితే వీటిలో చాలా వరకు కనీస నాణ్యతాప్రమాణాలు పాటించడంలేదు. తక్కువ ధరకు ఆహార పదార్థాలంటూ బోర్డులు వేలాడదీసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఫలితంగా నాణ్యతలేని ఆహారం తిని ప్రజలు అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు. వరంగల్‌తో పాటు హనుమకొండ, కాజీపేట, మహబూబాబాద్, జనగామ, పరకాల, తొర్రూరు, నర్సంపేట లాంటి ప్రధాన పట్టణాల్లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. ఈ ఫాస్ట్‌ఫుడ్ వల్ల అనేక రకాల ఇబ్బందులుంటాయని వైద్యులు చెబుతున్న పట్టించుకునేవారు లేరు.



కాజీపేట ప్రాంతంలో రహదారుల పక్కన తయారవుతున్న ఆహార పదార్థాలు

రంగులు వేస్తే అంతే

ఆహార పదార్థాలు సర్వం రంగులమయంగా మారుతున్నాయి. చికెన్ పకోడీలో రంగు, జిలేబీలో రంగు, నోరూరించే కారలో రంగులు.. ఇలా చెప్పుకుంటూపోతే దాదాపు తినుబండారాలన్నింటిలో రంగులు కలుపుతున్నారు. దీంతో ఆహారం సహజత్వం కోల్పోయి కలుషితమవుతోంది. వీటిని తినడం ద్వారా మనిషి వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతాడు. ఇది తెలియని చాలామంది తక్కువ ధరకు లభిస్తుందని ఆకలి తీర్చుకోవడానికి ఫాస్ట్‌ఫుడ్‌ను ఇష్టంగా లాగిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు..

పట్టణాలతోపాటు మారుమూల ప్రాంతాల్లో కూడా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సాయంత్రం నాలుగు గంటలైతే ప్రధాన రహదారుల్లో వందలాది దుకాణాలు దర్శనమిస్తున్నాయి. వీటిలో చాలా వరకు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. కల్తీ రాజ్యమేలుతోంది. ఇది తెలియక తింటున్న భోజన ప్రియులు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి రోజూ వేలాది మంది వస్తుంటారు. వేలాది మంది విద్యార్థులు నగరంలో చదువుకుంటున్నారు. పెద్ద హోటళ్లలో ధరలు భారీగా ఉన్న నేపథ్యంలో స్థానికంగా బండ్ల వ్యాపారులు విక్రయించే ఆహార పదార్థాలు తక్కువ ధరకు లభిస్తుండడంతో ఇటువైపు మొగ్గుచూపుతున్నారు. ఇందులో కొంతమంది దుకాణాదారులు రుచితో ఆకట్టుకునేందుకుగాను ఆరోగ్యానికి హానికలిగించే నిషేధిత వస్తువులతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు.



అంతా అపరిశుభ్రతే

ఫాస్ట్‌ఫుడ్ దుకాణాదారులు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోగా చాలా షాపులు మురుగు కాలువలు, మురుగు నీటి ప్రవాహం పక్కనే ఏర్పాటు చేస్తుండడం ఆందోళన కలిగించే విషయం. దోమలు, ఈగలు ఆహార పదార్థాలపై వాలుతాయి. వంటకాలకు వాడిన నూనె మళ్లీ మళ్లీ వాడుతుండడంతో జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బయట ఆహారం వద్దు



రహదారుల పక్కన బయట ప్రాంతాల్లో తయారయ్యే ఆహార పదార్థాలను భుజించకపోవడమే ఉత్తమం. కల్తీ నూనె వాడకంతో పాటు మసాలాలు సరైనవి కాదని గుర్తించాలి. వీటిని తినడం వల్ల జీర్ణక్రియకు సంబంధించిన వ్యాధులు ప్రబలుతాయి. పిల్లలకు బయట ఫుడ్ ఇవ్వకపోవడమే మంచిది.

-బొల్లికొండ యాదగిరి, సోమిడి

ఫాస్ట్‌ఫుడ్ తినడం మంచిదికాదు



ఫాస్ట్‌ఫుడ్ తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. ప్రధానంగా యువత ఫాస్ట్‌ఫుడ్ వైపు మక్కువ చూపుతోంది. రుచులు, రంగులకు తలొగ్గి ఫాస్ట్‌ఫుడ్‌లకు వెళ్లి లాగించేస్తోంది. దీనివల్ల వచ్చే అనార్థాలను మాత్రం గుర్తించడం లేదు. ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్త పరచాలి. ఫాస్ట్‌ఫుడ్ వల్ల అనేక వ్యాధులు వస్తాయని వారికి చెప్పాలి. ఈ విషయంలో సంబంధిత అధికారులు కూడా స్పందించి తనిఖీలు చేయాలి.

-డాక్టర్ మధులత, కాజీపేట

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- రూ.1.62 లక్షల విలువైన వెండి, బంగారం, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్ : అంతర్ జిల్లా దొంగను పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.1.62 లక్షల విలువైన వెండి, బంగారం, రెండు సెల్‌ఫోన్లు, రూ.1.10 లక్షల విలువైన బైక్ స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. ఈమేరకు గురువారం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్సై బి.విజయ్ కుమార్ సిబ్బందితో కలిసి ఈదులపూసపల్లి రోడ్డులోని మహర్షి స్కూల్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈదులపూసపల్లి వైపు నుంచి ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అనుమానం వచ్చి ఆపి వివరాలు తెలుసుకున్నారు. భద్రాదికొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ శివారు దివ్యాంగుల కాలనీకి చెందిన కోట్ల ముత్యాలరావు అని తెలిసింది. కొంతకాలం నుంచి మహబూబాబాద్ మండలం దర్గా తండాలో ఉంటున్నట్లు గుర్తించారు. సదరు వ్యక్తి నంబర్ ప్లేట్ లేని బైక్‌పై వస్తూ వాహన ధ్రువపత్రాలు చూపించకపోవడంతో పాటు గతంలో పలు చోరీల కేసుల్లో అరెస్ట్ అయి జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలుసుకున్నారు. నంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనం ఎక్కడిదని అడగగా మహబూబాబాద్ నెహ్రూ సెంటర్‌లో చోరీ చేశానని ఒప్పుకున్నాడు. అతడి వద్ద తనిఖీ చేయగా కొన్ని నెలలుగా మహబూబాబాద్ పట్టణంలో చోరీ చేసిన కొన్ని వెండి, బంగారం, సెల్ ఫోన్లు లభించాయి. వాటిని అమ్మేందుకు తీసుకెళ్తున్నానని తెలపడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో టౌన్ ఎస్సైలు బి.విజయ్ కుమార్, చల్ల అరుణ, హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ, పీసీలు సుధీర్, శ్రీకాంత్, వీరన్న, రుద్రయ్య, సత్రాం, రమేశ్ చందర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు గడువు పొడిగింపు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తుల గడువును జూలై 21 తేదీ వరకు పొడిగించినట్లు వరంగల్, హనుమకొండ కళాశాలల ప్రిన్సిపాల్స్ జుమ్లానాయక్, జి.సత్రు గురువారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. సంవత్సరం కోర్సులు కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ సెక్రటేరియల్ అసిస్టెంట్, వెల్డర్, రెండు సంవత్సరం కోర్సులు డ్రాఫ్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్, రిఫ్రిజిరేషన్, డిజైనింగ్, టెక్నీషియన్ కోర్సులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. http://iti.teanfana.gov.in సైట్‌లో తమ వ్యక్తిగత మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇందులో 10 శాతం ఐఎంసీ ఫీజు పేమెంట్ సీట్లు ఉన్నాయని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

బిల్లుల చెల్లింపుపై ప్రచారం చేయాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే విధానంపై విస్తృత ప్రచారం చేయాలని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. గురువారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సర్కిల్‌కు నియమించిన నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. యాప్‌తో పాటు ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా సులభంగా బిల్లులు చెల్లింపు చేయొచ్చన్నారు. యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లే స్టోర్ నుంచి వినియోగదారులు సులువుగా డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌లో భాగంగా ఫీడర్లపై అంతరాయాలను తగ్గించడానికి ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఏబీ స్విచ్‌లు మరమ్మతు చేయాలని సూచించారు. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్ రావు, కె.కిషన్, రాజు చౌహాన్, కె.ఎస్.గుట్ట, జి.ఎంలు గౌతమ్ రెడ్డి, నాగప్రసాద్, వేణు బాబు, దేవేందర్, మాధవరావు, అన్నపూర్ణ, డీఈ(టీ)శ్రీధరాచారి పాల్గొన్నారు.

వరంగల్‌లో 'గరీబ్‌రథ్'కు హోల్టింగ్..

- 27, 29వ తేదీల నుంచి అమలు

కాజీపేట రూరల్ : వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే రెండు గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు హోల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు.జూలై 27వతేదీ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–హజ్రత్‌నిజాముద్దీన్ (12611) ఎక్స్‌ప్రెస్‌కు, అదేవిధంగా జూలై 29వ తేదీ నుంచి హజ్రత్‌నిజాముద్దీన్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12612) ఎక్స్‌ప్రెస్‌కు అప్ అండ్ డౌన్ రూట్‌లో ఎక్స్‌పర్మెంటల్ హోల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. గతంలో ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు తెలంగాణలో హోల్టింగ్ లేదు. బల్లార్షాలో మాత్రమే హోల్టింగ్ ఉంది. ఇప్పుడు వరంగల్‌లో హోల్టింగ్ కల్పించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నగదురహిత హెల్త్ కార్డులు ఇప్పిస్తాం



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

నల్లబెల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు నగదు రహిత చికిత్స అందించే విధంగా నూతన హెల్త్ కార్డులు ఇప్పిస్తామని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. సంఘం సభ్యత్వ నమోదులో భాగంగా స్థానిక హైస్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి త్వరలోనే ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కేవలం పీఆర్‌టీయూతోనే సాధ్యమన్నారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు ఇప్పించిన ఘనత పీఆర్‌టీయూకే దక్కిందన్నారు.

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

ఐనవోలు: త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని ఐనవోలు, వెంకటాపూర్, సింగారం, మరియపురం, పున్నేలు, పంథిని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..త్వరలో ముఖ్యమంత్రిని కలిసి పారిశుద్ధ్య కార్మికుల నియామకం, ఉచిత విద్యుత్, పెండింగ్ బిల్లుల మంజూరీ, పెండింగ్‌లో ఉన్న 5డీఏలలో 3డీఏలను, పీఆర్సీపై తగిన ఉత్తర్వులు ఇప్పిస్తామని భరోసా కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం బాధ్యులు ఈదునూరి రవీందర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, మండల తిరుపతి రెడ్డి, నల్లబెల్లి మండల అధ్యక్షుడు మహేందర్, రాజేందర్, చంద్రశేఖర్, శ్రీహరి, సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

ఎంజీఎంను సందర్శించిన ఐటీ నిపుణులు



ఎంజీఎంలో ఐటీ నిపుణులు, తహసీల్దార్ ఇక్బాల్

ఎంజీఎం: ఎంజీఎంపై వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈక్రమంలో ఆస్పత్రికి వచ్చే రోగులు ఓపీ నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు అన్ని వివరాలు ఆన్‌లైన్ చేసేందుకు ఐటీ నిపుణుల బృందం ఎంజీఎంను సందర్శించింది. ఈసందర్భంగా ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో సేవలు ఎలా కొనసాగుతున్నాయి? అడ్మిషన్ ప్రక్రియ ఎలా సాగుతోంది? వాటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చేలా ఎలా ముందుకు సాగాలి అనే అంశాలను బృంద సభ్యులు పరిశీలించారు. ఐటీ నిపుణుల వెంట ఆర్‌ఎంఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఒక్క రోజులో రూ.లక్ష మాఫీ చరిత్రాత్మకం
- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: రుణమాఫీపై రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకున్నారని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. రూ.లక్ష రుణ మాఫీ చేసిన సందర్భంగా గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి టెస్కాబ్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, పాలక మండలి సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు క్షీరాభిషేకం నిర్వహించారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క రోజు రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ రూ.లక్ష రుణమాఫీ చేయడం చరిత్రాత్మకమన్నారు. గత ప్రభుత్వం విడతలుగా చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒకే సారి రుణమాఫీ చేస్తోందన్నారు. ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందన్నారు. రుణమాఫీపై విపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయని, వారి మాటలు పట్టించుకోవద్దన్నారు. వరంగల్ డీసీసీబీ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 57,129 మంది రైతులకు రూ.249.61 కోట్ల రుణమాఫీ చేస్తున్నామన్నారు. రుణమాఫీతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, డైరెక్టర్లు రాజేశ్వర్ రెడ్డి, హరిప్రసాద్, గోపాల్ రావు, నర్సింగరావు, రమేశ్, పీఏసీఎస్ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

కమ్యూనిస్టుల పోరాటాలతోనే సంస్కరణలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కురవి: కమ్యూనిస్టుల పోరాటాలతోనే దేశంలో అనేక సంస్కరణలు, మార్పులు జరిగాయని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఈశ్వరసాయి ఫంక్షన్‌హాల్‌లో మహబూబాబాద్ జిల్లా నిర్మాణ సమావేశం డోర్నకల్ నియోజకవర్గ పార్టీ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. పార్టీ పతాకాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు ఎగురవేశారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దేశంలో శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న ఏకైక పార్టీ సీపీఐ అని తెలిపారు. నిరంతరం ప్రజాసమస్యలపై పోరాటాలు చేయాలని, అలా చేస్తే జనం మన వెంటే ఉంటారని తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ ఖాళీ అవుతుందని, ఆ ఖాళీని పోరాటాలతో భర్తీ చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ఏ పార్టీతో పొత్తుల కోసం వెంపర్లాడబోమని వెల్లడించారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ నేత , సీఎం రేవంత్ రెడ్డి ఏ పార్టీ నుంచైనా మారి ఇతర పార్టీలకు వెళ్తే పిచ్చికుక్కలను కొట్టినట్లు కొట్టాలని తెలిపారన్నారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే ఆ పిచ్చికుక్కలు అన్న వ్యక్తే కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పార్టీల మారడాన్ని సీపీఐ ఒప్పుకోదన్నారు. ఆ పార్టీలు అధికారం లేకుంటే బతకలేవని విమర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, బి.అజయ్‌సారథిరెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, కరణం రాజన్న, పోగుల శ్రీనివాస్‌గౌడ్, నెల్లూరు నాగేశ్వర్‌రావు, పెరుగు కుమార్, వరిపల్లి వెంకన్న, బుర్ర సమ్మయ్య, తురక రమేశ్, కన్నె వెంకన్న, పాండురంగాచారి, వెంకన్న, సాంబలక్ష్మి, భిక్షపతి, నవీన్, బాలకృష్ణ, రశీద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

కులగణన తర్వాతే 'స్థానికం' నిర్వహించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాజీపేట అర్బన్ : బీసీ కులగణన చేపట్టి రిజర్వేషన్ల పెంచిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమగ్ర కులగణన యాత్ర సభకు శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల లెక్కలు తేల్చాలంటే ప్రభుత్వాలకు బాధ ఎందుకని ప్రశ్నించారు. బీసీలను దూరం చేసుకునే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ తగ్గిందని గుర్తు చేశారు. శాసన సభ ఎన్నికల ముందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో బీసీ కులగణన చేపడుతామన్నారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని, లేనిపక్షంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు కనకాల శ్యామ్ కుర్మ, విక్రమ్‌గౌడ్, మణి మంజరి, కుందారపు గణేశ్‌చారి, బాలరాజ్‌గౌడ్, సగర శేఖర్, ఎలకట్టి విజయ్‌కుమార్, బొనగాని యాదగిరిగౌడ్, బత్తుల రాజన్‌బాబు, జనగాని శ్రీనివాస్, దాడి మల్లయ్యయాదవ్, బచ్చు ఆనందం, డాక్టర్ చిర్రరాజుగౌడ్, తాళ్లపల్లి సురేశ్, కానగోని అశోక్‌గౌడ్, అరేగంటి నాగరాజు , యాకయ్య,శోభారాణి,పద్మజ, పంజాల మధు, మారగోని రవి,ఆదర్శ్ గౌడ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

టీజీ డీఎస్సీ ప్రారంభం

తొలిరోజు 1,161మంది అభ్యర్థుల హాజరు

- రెండు సెషన్లలో పరీక్ష
- పర్యవేక్షించిన అధికారులు
- బందోబస్తు నిర్వహించిన పోలీసులు

విద్యారణ్యపురి: రాష్ట్రంలో టీచర్ల నియామకానికి నిర్వహించే టీజీడీఎస్సీ గురువారం నుంచి ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో మొదటి సెషన్ అన్నింటిలో పరీక్ష నిర్వహించగా.. మధ్యాహ్నం మాత్రం ఒకే కేంద్రంలో జరిగింది. ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఇందుకు హనుమకొండలోని జయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, హసన్‌పర్తిలోని నోబుల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్, హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్ట వద్ద ఉన్న అయాన్ డిజిటల్ జోన్, హసన్‌పర్తి భీమారం సమీపంలోని మోక్షిత కంప్యూటర్స్ కేంద్రాల్లో గురువారం పరీక్ష జరిగింది. గురువారం ఉదయం మొదటి సెషన్‌లో ఆయా కేంద్రాల్లో కలిపి 1,206మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1,038మంది హాజరయ్యారు. 158మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 138మంది అభ్యర్థులకు 123మంది హాజరయ్యారు. 15మంది గైర్హాజరయ్యారు. అబ్జర్వర్లు పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. నిర్దేశించిన పరీక్షసమయం ఉదయం 9గంటలుకాగా 15 నిమిషాలు ముందుగానే ఉదయం 8.45గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. మధ్యాహ్నం 1.45 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోనికి వెళ్లాక బయోమెట్రిక్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించారు. ఫొటో ఐడీకార్డును పరిశీలించారు. మరో 12రోజులపాటు ప్రతిరోజు రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో డీఎస్సీ పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

కొడుకు పుడితే.. మృత ఆడశిశువును ఇచ్చారు?

- హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో కుటుంబ సభ్యుల ఆందోళన

హన్మకొండ చౌరస్తా: కొడుకు పుడితే మృతిచెందిన ఆడశిశువును అప్పగించారంటూ గురువారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో బాలింత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. బాలింత భర్త కలకొల్లు సాంబరాజు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కలకొల్లు సాంబరాజు భార్య అనూషకు పురిటినొప్పులు వస్తుండడంతో ఈ నెల 17న హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్రసవానికి సమయం ఉందని అడ్మిట్ చేసుకున్నారు. గురువారం ఉదయం మరోసారి వైద్య పరీక్షలు చేసిన వైద్యులు గర్భంలో శిశువు కదలికలు లేవని, ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ తర్వాత మృత ఆడశిశువును తీసుకొచ్చి అప్పగించారని, శిశువుకు ఎలాంటి ట్యాగ్ వేయలేదని, తమకు కొడుకు పుడితే మార్చి వేరొక మృత ఆడ శిశువును అప్పగించారని అనూష భర్త సాంబరాజు తెలిపారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే మాకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మాకు పెళ్లయిన ఏడు సంవత్సరాలకు బాబు పుడితే సంతోషం లేకుండా చేశారని రోదిస్తూ తెలిపారు. ఈ ఘటనపై జీఎంహెచ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మిని వివరణ కోరగా తల్లిగర్భంలోనే శిశువు చనిపోయిందని, ఆ విషయాన్ని ముందే కుటుంబ సభ్యులకు తెలియజేసి వారి సంతకాలను కూడా తీసుకున్నామని తెలిపారు. మగ శిశువుకు బదులు ఆడ శిశువు అని ఎందుకు చెబుతామని, ఏదైనా ఉంటే పోలీసు కేసు పెట్టుకోవచ్చని, విచారణలో నిజం తెలుస్తుందని వివరణ ఇచ్చారు.



జీఎంహెచ్ ఎదుట ఆందోళన చేస్తున్న బాలింత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు